క్లుప్తంగా

ప్రేమ భావనే హరనాథుని అభీష్టం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):ప్రేమ భావన ప్రజల మధ్య ఐక్యతను పెంచి చైతన్యవంతుల్ని చేసి శాంతిస్థాపన జరుగుతుందని కుసుమ హరనాథులు అభిలాషించే వారని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్యగుప్తా అన్నారు. పాతబస్తీలోని కుసుమహరనాథుల ఆలయంలో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం సాయంత్రం హజరత్తయ్యగుప్తా ప్రసంగం జరిగింది. ఆయన మాట్లాడుతూ హరనాథులు లేఖల ద్వారా సందేహ నివృత్తి చేసి, భక్తి భావాలు పెంపొందించే విధంగా ప్రయత్నం చేశారన్నారు. ప్రతి వ్యక్తి గురుభక్తి, దేశభక్తి కలిగి ఉండాలన్నారు. తొలుత శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. దసరా ఉత్సవాల ప్రాముఖ్యతను వివరించారు. ధర్మ పరిరక్షణకు అందరూ తోడ్పడాలని సూచించారు. శ్రీ కుసుమ హర సేవా సమితి అధ్యక్ష కార్య దర్శులు చీతిరాల మోహనరావు, బొర్రా మల్లే శ్వరరావు తదితరులు అతిథులను సత్కరిం చారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు.

సాయిబాబా మందిరంలో ముగిసిన దసరా ఉత్సవాలు



భవానీపురం(విజయవాడపశ్చిమ):ఓల్డ్ హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోగల సంకల్ప సిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. విజయ దశమి రోజున శ్రీరాజరాజేశ్వరి దేవి అలంకా రంలో దర్శనమిచ్చిన అమ్మవారితోపాటు బతు కమ్మ ప్రతిమకు కూడా ప్రత్యేక పూజలు చేశారు. సాయిబాబా సమాధి ఉత్సవాన్ని భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. పాలకమండలి అధ్యక్షులు బూర్లె వెంక టేశ్వరరావు నేతృత్వంలో నిర్వహించిన వేడు కల్లో గౌరవాధ్యక్షులు వూటుకూరి శివనారా యణ, ఉపాధ్యక్షుడు మోటమర్రి సుబ్బారావు, కోశాధికారి చందలూరి రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి పీవీఎల్ ప్రసాద్, సహాయ కార్యదర్శి గుడివాడ విజయకుమార్, సభ్యులు పి.రజనీ కాంత్, యెనిగళ్ల సుబ్బారావు, సాయి సేవకులు పాల్గొన్నారు.

దుర్గగుడి అభివృద్ధికి తొలి ప్రాధాన్యం



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తన నియోజకవర్గ పరిధిలో ఉన్న కనక దుర్గమ్మ గుడి అభివృద్ధికి తొలి ప్రాధాన్యం ఇస్తానని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి చెప్పారు. పిన్నమనేని పాలిక్లీనిక్ రోడ్డులోని ఓ హోటల్లో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. సుజనా చౌదరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధి కారంలోకి వచ్చిన తర్వాత జరిగిన మొదటి దసరా ఉత్సవాలు ఇవేనని తెలిపారు. ఈ ఉత్స వాల్లో చిన్న పాటి లోటు పాట్లను గుర్తించామ ని, వచ్చే ఏడాది దసరా ఉత్సవాల్లో అవి పున రావృతం కాకుండా చూస్తామన్నారు. ప్రతి ఏడాది దసరా సందర్భంగా భక్తులకు అవసర మైన సౌకర్యాలు తాత్కలికంగా ఏర్పాటు చేస్తు న్నారని వచ్చే ఏడాది అలా కాకుండా శాశ్వతం గా ఉండేలా చేస్తామని చెప్పారు. భక్తులు కొం డపైకి రావడానికి ఒకటి మార్గం, అమ్మ వారి దర్శనం అనంతరం భక్తులు కొండ దిగడానికి మరో మార్గం ఏర్పాటుకు ఆలోచనలు చేస్తు న్నామని చెప్పారు. దుర్గగుడి అభివృద్ధికి ఆ ప్రాంత ఎమ్మెల్యేగా తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

ఐఎంఏ నగరశాఖ నూతన కమిటీ ఎన్నిక

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విజయవాడశాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. గవర్నర్‌పేటలోని అసోసియేషన్ హాల్లో ఆదివారం జరిగిన సర్వసభ్య సమా వేశంలో 2024–25 సంవత్సరానికి గాను నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా డాక్టర్ బోడేపూడి హను మయ్య, కార్యదర్శిగా డాక్టర్ వుమ్మినేని సురేష్ కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, కోశా ధికారికి జరిగిన ఎన్నికలో డాక్టర్ ఎంవీ సుబ్బారావు గెలుపొందారు. వీరితో పాటు ఉపాధ్యక్షులుగా డాక్టర్ వీఎస్ వరప్రసాద్, డాక్టర్ వి.పద్మజ, జాయింట్ సెక్రటరీలుగా డాక్టర్ పి.సుశీల, డాక్టర్ ఉప్పులేటి తారకప్ర సాద్, స్టేట్ కౌన్సిల్ సభ్యులుగా డాక్టర్ పి.అ నిల్‌కుమార్, డాక్టర్ పి.జయకర్‌బాబు, ఎగ్జి క్యూటివ్ సభ్యులుగా డాక్టర్ పీఈ సోనిలాల్, డాక్టర్ కదీర్ షరీఫ్, డాక్టర్ జి.శరత్‌చంద్రలు ఎన్నికయ్యారు.



మహామండపం కుంకుమ పూజ వద్ద భక్తులు



కేశఖండన శాల వద్ద తలనీలాలు సమర్పిస్తున్న భవానీలు

ఎరుపెక్కిన ఇంద్రకీలాద్రి..



పూజలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన, విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, మున్సిపల్ కమిషనర్ ధ్యాన్‌చంద్ర తదితరులు

ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ సన్నిధిలో శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు శనివారంతో ముగిసినా ఆదివారం కూడా భక్తుల రద్దీ కొనసాగిం ది. వేలాది మంది భవానీలు అమ్మవారిని దర్శించుకు నేందుకు తరలిరావడంతో ఇంద్రకీలాద్రి ఎరుపెక్కింది. కొందరు భవానీలు తమ దీక్షలు విరమించారు. లోకమాతా.. కరుణించమ్మా అంటూ భవానీలు అమ్మవారిని వేడుకున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



పూజ కార్యక్రమంలో దుర్గగుడి ఈఓ రామారావు



అంతరాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



దీక్ష విరమణ చేస్తున్న భవానీలు



జల్లు స్నానాలు చేస్తున్న భవానీలు



కనకదుర్గ ఫ్లై ఓవర్‌పై నుంచి రైల్వేసబ్‌వే వరకు ట్రాఫిక్ జామ్



కిటకిటలాడుతున్న క్యూలైను

పూర్ణాహుతితో ముగిసిన ఉత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న దసరా ఉత్స వాలు శనివారంతో ముగిశాయి. రాజరాజేశ్వరిదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమి చ్చారు. అమ్మవారిని వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఇన్ చార్జి మల్లాది విష్ణు దర్శించుకున్నారు. పూర్ణాహు తితో ఉత్సవాలు ముగియగా, సాయంత్రం అమ్మవారి నగరోత్సవ సేవ నిర్వహించారు. ఆలయం నుంచి ఊరేగింపు ప్రారంభం కాగా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, సహాయ కార్యద ర్శులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. భీమనవారిపేటలోని విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో దసరా ఉత్సవాలు ముగి శాయి. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ అర్చకులు చిం తలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మ ఉభయదాతలచే పూర్ణాహుతి జరిపించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో శమీ పూజ నిర్వహించగా, పెద్ద ఎత్తున ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. పాలప్రాజెక్టు ఎదుట ఉన్న గంగానమ్మ దేవస్థానంలో దసరా ఉత్సవాలు ముగి శాయి. ఆలయ ప్రాంగణంలో విన్నకోట శ్రీనివాస రావు శర్మ పర్యవేక్షణలో పూర్ణాహుతి నిర్వహిం చారు. ఉభయదాతలు బసవ కాశీ విశ్వనాథ్, సుం కర వెంకటేశ్వరరావు, ఉమ్మిశెట్టి వెంకట దుర్గా శివ నాగేంద్ర, కుంచెం శ్రీనివాసరావు, పిల్లా ఏసు బాబు, మాచర్ల సూర్యతేజ, పట్నాల అప్పారావు దంపతులు పూజల్లో పాల్గొన్నారు.



విజయదుర్గా ఆలయంలో పూర్ణాహుతి



నగరోత్సవంలో మహాలక్ష్మీ అమ్మవారు

ముగిసిన ద్విశత చండీ యాగం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):కన్యకా పర మేశ్వరీ విస్సంశెట్టి వేంకటరత్నం హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలో చేప ట్టిన శ్రీ రుద్ర సహిత ద్విశత చండీ యాగం శనివారంతో ముగిసింది. పది రోజుల పాటు లోక సంక్షేమాన్ని కాంక్షిస్తూ అత్యంత భక్తిశ్రద్ధ లతో నిర్వహించిన ద్విశత చండీయాగం పూర్ణా హుతితో ముగించారు. కేబీఎన్ కళాశాల ప్రాంగ ణంలోని శ్రీ దాసాంజనేయస్వామి వారి దేవ స్థానం సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంగణంలో దసరా ఉత్సవాలను పురస్కరించు కొని చేపట్టిన ఈ కార్యక్రమం వైభవంగా ముగించారు. ఉత్సవాల ముగింపును పురస్కరిం చుకొని యాగమండపంలో పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా సుమారు వెయ్యి మంది మహిళలతో సువాసిని పూజ చేశారు.

ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసి అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శ నమిచ్చారు. అమ్మవారి అలంకారానికి సంబం ధించిన మూలమంత్ర సంపుటితో చండీ హోమం చేశారు. రుద్ర, సుదర్శన, లక్ష్మీగణపతి, గరుడ, మృత్యుంజయ, మన్యుసూక్త, నవగ్రహ హోమాలు కొనసాగించారు. వేదపండితులను సత్కరించారు. కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యద ర్శులు తొమ్మండ్రు శేషయ్య, గోపిశెట్టి మల్లయ్య, కోశాధికారి గోళ్ల బాబావిజయకుమార్, కేబీఎన్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ఉసిరిక ఉమామ హేశ్వరరావు, తూనికుంట్ల శ్రీనివాసు, పొట్టిశ్రీ రాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్, హిందూ హైస్కూల్స్ విద్యాసం స్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి. నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు. ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలోనూ స్వామి వారికి ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు.



పూర్ణాహుతిలో పాల్గొన్న కమిటీ ప్రముఖులు

వైభవంగా ముగిసిన దసరా మహోత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేట గం గానమ్మ అమ్మవారి దేవస్థానంలో దసరా ఉత్సవా లను పురస్కరించుకొని శనివారం శ్రీరాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బ్రాహ్మణవీధిలో వేంచేసి ఉన్న చదునుమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థా నంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా అష్టలక్ష్మీ అమ్మవార్లు సైతం విశేషఅలంకారంలో దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారికి నగరోత్సవాన్ని నిర్వహిం చారు. శేషయ్యవీధిలోని శ్రీ కృష్ణ ప్రార్థనా మందిరం లో అమ్మవారు ప్రసన్నవదనంతో ఉదయం శ్రీ మహిషాసురమర్దినీదేవిగా, మధ్యాహ్నం నుంచి శ్రీరాజరాజేశ్వరిదేవిగా భక్తులకు కనువిందు చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గోకవరపు మురళీకృష్ణ, కార్యదర్శి గుడిపాటి పాపారావు తదిత రులు పాల్గొన్నారు. కొత్తగుళ్ల ప్రాంగణంలో వేం చేసి ఉన్న పలు ఆలయాల్లో విజయదశమి పర్వది నాన్ని పురస్కరించుకొని పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోదండరామస్వామి దేవస్థానం ప్రాంగణంలో సాయంత్రం ఉత్సవమూర్తులను వేం చేయింపజేసి శమీపూజను నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి, నగరేశ్వరస్వామి వారి దేవస్థానంలోని ఉత్సవమూర్తులను కూడా ఆలయ ప్రాంగణంలో వేంచేయింపజేసి శమీపూజను నిర్వహించారు. పాం డురంగస్వామి వారి దేవస్థానంలోనూ శమీపూజ నిర్వహించారు. అర్చకస్వాములు పులిపాక రాఘ వాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కేబీఎన్ కళాశాల ఆవరణలోని శ్రీ దాసాంజనే యస్వామి దేవస్థానంలో జరుగుతున్న దసరా శర న్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. విం చిపేట అభోతుల అప్పన్న వీధిలో కొలువైన కోదం డరామాలయంలో దసరా మహోత్సవాల ముగిం పును పురస్కరించుకొని శమీపూజ నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్ చార్జి వెలంపల్లి శ్రీని వాసరావు, ఆలయ ధర్మకర్త యలకల చలపతిరావు పాల్గొన్నారు. శనివా రంతో పది రోజు లుగా ఆలయంలో జరుగుతున్న ఉత్స వాలు ముగించారు.



పూజల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ వెస్ట్ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు,



భ్రమరాంబ అమ్మవారు



విజయలక్ష్మీదేవిగా పద్మావతి అమ్మవారు



కొత్తగుళ్లు ప్రాంగణంలో శమీ పూజలో కొలువైన కోదండరాముడు



పాండురంగస్వామి సన్నిధిలో



దాసాంజనేయస్వామి సన్నిధిలో రాజరాజేశ్వరిదేవి

నేత్రపర్వంగా శ్రీవారి గరుడోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):పాతబస్తీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి గరుడోత్సవం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవ స్థానంలో స్వామి వారి జన్మనక్షత్రమైన శ్రవణానక్ష త్రాన్ని పురస్కరించుకొని ప్రత్యేక తిరుమంజన స్నపనాభిషేకం నిర్వహించారు. దసరా ఉత్సవాల ముగింపు రోజైన విజయదశమి రోజున స్వామి వారి సన్నిధిలో పలు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి ప్రీతికరమైన శనివారం రోజున శ్రవణానక్షత్రం, దసరా పర్వదినం కావటంతో భక్తులు విశేషంగా భావించి భారీగా ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయంలో కొలువై ఉన్న పద్మావతి అమ్మవారికి విజయలక్ష్మీదేవిగా అలం కరించి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి విశేష అర్చనలు నిర్వహించారు. భూదేవి సమేత శ్రీ వెంక టేశ్వరస్వామి వారి ఉత్సవ మూర్తులను గరుడవా హనంపై అధిష్ఠింపజేసి మేళతాళాలతో నగరోత్సవం నిర్వహించారు. బ్రాహ్మణవీధిలోని స్వామి వారి ఆలయ ప్రాంగణం నుంచి బయలుదే రిన నగరోత్సవం నెహ్రూబొమ్మ సెంటర్ తదితర ప్రాంతాల మీదుగా కొత్తపేట కేటీరోడ్డులోని జమ్మి వెంకటేశ్వరస్వామి వారి ప్రాంగణానికి చేరుకుంది. అక్కడ స్వామి వారిని వేంచేయిం పజేసి శమీపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అక్కడకు చేరుకొని పూజలు చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ కార్యని ర్వహణాధికారి పర్యవేక్షించగా పం డితులు పొన్నంగిప ల్లి శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షణలో అర్చక స్వాములు దీక్షిత్ తదితరులు పూజలు చేశారు.



గరుడవాహనాన్ని అధిష్ఠించి నగరోత్సవానికి వెళ్తున్న వెంకటేశ్వరస్వామి

రాష్ట్రాలు దాటొచ్చి.. ఉత్సవాల్లో ఉత్సాహంగా..

- నగరంలో వివిధ ఉత్తర భారతీయ సంఘాల ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు
- వేర్వేరు ప్రాంతాల్లో శనివారంతో ముగిసిన ఉత్సవాలు
- భారీగా పాల్గొన్న ఆయా సంఘాల ప్రతినిధులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):వారంతా ఉత్తర భారతంలోని పలు రాష్ట్రాల నుంచి నగరానికి వలస వచ్చారు. అయినా వారి సంప్రదాయాలు, ఆచారాలు మర్చిపోలేదు. దసరా ఉత్సవాలు తమ తమ రాష్ట్రాల్లో ఎలా ఆచరిస్తారో ఇక్కడా సామూహికంగా ఆచరించి పండుగను ఘనంగా జరుపు కున్నారు. నగరంలోని వివిధ సంఘాల ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో నవరాత్రి మహోత్సవాలు తమ ఆచారాలకు అనుగుణంగా వైభవంగా జరుపుకొని ఆనందించారు. వారి సంప్రదాయాలను అనుసరించి పది రోజుల పాటు కుటుం బాలతో సహా హాజరై ఉత్సవాలను చేసుకున్నారు. విజ యవాడ గుజరాతీ సమాజ్ ఆధ్వర్యంలో పాతబస్తీలోని ఎల్ పీసీటీ గుజరాతీ విద్యాలయం ప్రాంగణంలో పది రోజుల పాటు నవరాత్రి ఉత్సవ్ పేరుతో ఉత్సవాలు నిర్వహించారు. తొమ్మిది రోజులు వారివారి సంప్రదాయాలకు అనుగుణంగా నృత్యాలు నిర్వహించారు. మహిళలు ప్రత్యేకంగా దసరా నృ త్య రూపకాన్ని ప్రదర్శించారు. తొమ్మిది అవతరాల్లో అమ్మ వారు ఏ విధంగా దుష్ట సంహారం చేశారో వివరించారు.

నబజగరన్ కమిటీ ఆధ్వర్యంలో పాతబస్తీలోని మాడపాటి క్లబ్ ప్రాంగణంలో 'సరబజనిన్ శ్రీశ్రీ దుర్గోత్సవ్' పేరుతో దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. పాతబస్తీలో వేలాది కుటుంబాలు బంగారం వస్తువుల తయారీలో నిమ గ్నమై జీవిస్తున్నారు. వారంతా ప్రతి ఏటా బెంగాల్ సంప్ర దాయాలకు అనుగుణంగా దసరా ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది మాడపాటి క్లబ్ ఆవరణలో ప్రత్యేకంగా దుర్గా మాత ఇతర దేవతామూర్తులను ప్రతిష్ఠించి ఉత్సవాలు చేశారు. శనివారం కృష్ణానదికి ఊరేగింపుగా వెళ్లి నదీతీరంలో ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. రోజూ నృత్యా లతో సందడి చేశారు. ఆదివారం సైతం ప్రత్యేక కార్య క్రమాలు నిర్వహించారు.

రామ్‌దేవ్ సేవా మండల్ ఆధ్వర్యంలో....

రామ్‌దేవ్ సేవా మండల్ ఆధ్వర్యంలో పాతబస్తీ పూజారి వారి వీధిలో ఉన్న రామ్‌దేవ్‌బాబా ఆలయ ప్రాంగణంలో మార్వాడీ సంఘీయులు, పురోహిత్ వర్గాలకు చెందిన వారు వేడుకలను నిర్వహించారు. ఆయా సంఘాలకు చెందిన అం దరూ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం నుంచి రాత్రి వరకూ ప్రత్యేక నృత్యాల్లో పాల్గొన్నారు. పది రోజుల పాటు కొనసాగిన ఉత్సవాల్లో పెద్ద ఎత్తున వారం దరూ పాల్గొని సందడి చేశారు. దసరా పర్వదినం రోజున ప్రత్యేక భోజన కార్యక్రమాలను, ఆలయంలో పూజలు నిర్వహించారు.



బెంగాలీలు వారి సంప్రదాయ పద్ధతిలో ఏర్పాటు చేసిన దుర్గామాత మూర్తులు